నిప్పుల కుంపటి

రాష్ట్రంలో దంచికొడుతున్న ఎండలు

రికార్డు స్థాయికి గరిష్ఠ ఉష్ణోగ్రతలు • వివిధ జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ జారీ

పోశెట్టి (ఫైల్)

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 41 నుంచి 43 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రెండు రోజులపాటు రాష్ట్రానికి తీవ్రమైన ఎండలతో పాటు వడగాల్పుల హెచ్చరికలను ఐఎండీ జారీ చేసింది. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు ప్రజలు బయటకు రావద్దని హెచ్చరించింది. వడగాల్పుల తీవ్రత అధికంగా ఉండటంతో భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వనపర్తి, జోగులంబ-గద్వాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. సూర్యాపేట, భద్రాద్రి-కొత్తగూడెం, నల్లగొండ జిల్లాల్లో భానుడు నిప్పులు కక్కుతున్నాడు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో ఆదివారం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నల్లగొండ జిల్లా మునుగోడు, వేములపల్లి, యాదాద్రి-భువనగిరి జిల్లా వలిగొండ, బొమ్మలరామారం మండలాల్లో తీవ్ర వడగాలులు వీస్తున్నట్టు వాతావరణ విభాగం ప్రకటించింది. ఖమ్మం జిల్లాలో గత మూడు రోజులుగా ఎండ తీవ్రత పెరిగింది. ఆదివారం మరింత తీవ్రస్థాయికి చేరినట్టు అధికారులు తెలిపారు. గడిచిన పదేండ్లలో ఎన్నడూ లేనంతగా.. సాధారణం కన్నా 6.1 డిగ్రీలు అదనంగా నమోదైనట్టు చెప్పారు. 42.8 డిగ్రీల ఎండ కాస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది. సోమవారం వనపర్తి, జోగులాంబ-గద్వాల జిల్లాలో అక్కడక్కడా వడగాల్పులు వీచే అవకాశం ఉండటంతో ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తొగర్రాయి గ్రామంలో కన్నెబోయిన కోటమ్మ (50), నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని కోర్భగల్లికి చెందిన చిన్న పోశెట్టి (52) వడదెబ్బకు గురై చనిపోయారు.

కొత్తకోటలో 44.3 డిగ్రీలు

వనపర్తి జిల్లాలో సూరీడు సుర్రుమంటున్నాడు. భానుడి భగభగలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆదివారం కొత్తకోటలో 44.3 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఎండ నుంచి ఉపశమనం కోసం ప్రజలు శీతల పానీయాలతో సేదతీరుతున్నారు. వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

నాలుగు రోజులు వర్ష సూచన

తీవ్రమైన ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు కాస్త ఉపశమనం కలగనున్నట్టు వాతావరణశాఖ తెలిపింది. ఆదివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నాలుగురోజులు వర్ష సూచన ఉన్నట్టు ఐఎండీ పేర్కొన్నది. ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. సోమవారం ఆదిలాబాద్, కుమ్రంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్-భూపాలపల్లి, ములుగు, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉండటంతో ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

నీ గది చల్లగా..

ఉష్ణోగ్రతను, విద్యుత్తు వినియోగాన్ని తగ్గించే సరికొత్త విండో కోటింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: ప్రస్తుత వేసవిలో ఎండలు మండిపోతున్నాయి. దీంతో ఇండ్లు, ఆఫీసులను చల్లగా ఉంచుకునేందుకు మనం రోజూ నానా పాట్లు పడాల్సి వస్తున్నది. అందులో భాగంగా సూర్యకాంతి ప్రసరణను అడ్డుకునేందుకు ఉదయాన్నే తలుపులు, కిటికీలను మూసేసి కర్టెన్లతో కవర్ చేయడంతోపాటు చల్లదనం కోసం ఏసీలు, ఎయిర్ కూలర్లను ఉపయోగించాల్సి వస్తున్నది. దీంతో విద్యుత్తు బిల్లులు తడిసి మోపెడవటంతో పాటు మన ఇల్లు/ఆఫీస్ వెలుపలి ప్రాంతాలను చూసేందుకు వీల్లేకుండా పోతున్నది. ఈ సమస్యలకు పరిష్కారంగా అమెరికాలోని నోట్రె డామ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు క్వాంటమ్ ఫిజిక్స్, మెషీన్ లెర్నింగ్ సాంకేతికతల సాయంతో పారదర్శకంగా ఉండే సరికొత్త విండో కోటింగ్‌ను అభివృద్ధి చేశారు. కంటికి కనిపించే కాంతి ప్రసరణకు మాత్రమే వీలుకల్పించడం, అతినీల లోహిత, పరారుణ కిరణాలను అడ్డుకోవడం దీని ప్రత్యేకత. పోలరైజ్డ్ సన్‌గ్లాసెస్ (కండ్లద్దాల) మాదిరిగా ఈ పూత గదిలోకి వచ్చే కాంతి తీవ్రతను తగ్గిస్తుందని, కానీ.. సన్‌గ్లాసెస్‌లా కాకుండా ఇది పారదర్శకంగా ఉంటుందని, కిటికీ అద్దాన్ని వివిధ కోణాల్లోకి వంచినప్పటికీ ఈ పూత ద్వారా వెలుపలి ప్రాంతాలను స్పష్టంగా చూడవచ్చని నోట్రె డామ్ వర్సిటీలోని 'మాన్‌స్టర్' ల్యాబ్ (మాలిక్యులర్/నానో-స్కేల్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ ఎనర్జీ లాబొరేటరీ) అధిపతి టెంగ్‌ఫీ లువో వివరించారు.

ట్రిపుల్ సెంచరీ కొట్టిన చికెన్!

- వారం వ్యవధిలోనే కిలో రూ.100 అధికం
- మరో రెండు నెలలు ఇదే పరిస్థితి
- కిలో 350కి పెరిగే అవకాశం

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): మాంసం ప్రియులకు చికెన్ ధరలు షాక్ ఇస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో వారం క్రితం వరకు కిలో రూ.200 నుంచి రూ.240 వరకు ఉన్న కిలో కోడి మాంసం ధర.. ఆదివారం రూ.300కు చేరింది. కొన్ని ప్రాంతాల్లో ఏకంగా రూ.320కు పెరిగింది. లైవ్ కోడి ధర కిలో రూ.220 నుంచి రూ.250 వరకు, నాటు కోడి రూ.500 వరకు పలికింది. ఒక్కో కోడిగుడ్డును రూ. 6 నుంచి రూ.7 వరకు విక్రయిస్తున్నారు. దీంతో వినియోగదారులకు పట్టపగలే చుక్కలు కనిపించాయి. మరో రెండు నెలల వరకు ఇదే పరిస్థితి కొనసాగవచ్చని, రానున్న రోజుల్లో కిలో చికెన్ ధర రూ.350 వరకు పెరిగే అవకాశం ఉన్నదని వ్యాపారులు, పౌల్ట్రీ యజమానులు అంటున్నారు. ప్రస్తుతం వేసవి తీవ్రత పెరగడంతో కోళ్ల ఉత్పత్తి బాగా తగ్గిపోయిందని, దీనికి తోడు దాణా రేట్లు కూడా పెరగడం చికెన్ ధరల పెరుగుదలకు కారణమని చెప్తున్నారు.

విద్యా - ఉద్యోగ సమాచారం

'అతిథి దేవోభవ'ను విస్మరించాం

ఏఎస్ఐఎస్‌సీ సమావేశంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : పురాతన భారతీయ సిద్ధాంతాలైన అతిథి దేవోభవను మనం పూర్తిగా విస్మరించామని, వసుధైక కుటుంబమనే భావనను వదిలేశామని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిగా స్వార్థపూరితంగా మారిపోయామని, ఇంటికి అతిథి వస్తే ఎప్పుడెల్లిపోతారా? అని వేచిచూసే రోజుల్లో మన మున్నామని, ఇలాంటి మనస్తత్వం నుంచి అంతా బయటపడాలని ఆయన కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన అసోసియేషన్ ఆఫ్ స్కూల్స్ ఫర్ ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ (ఏఎస్ఐఎస్‌సీ) తెలంగాణ, ఏపీ రాష్ట్రాల వార్షిక సాధారణ సర్వసభ్య సమావేశంలో బుర్రా వెంకటేశం మాట్లాడుతూ.. గొప్ప వారసత్వ సంపదకు మనమంతా వారసులమని, మన భవిష్యత్తు తరాలు మనం గర్వించే సంప్రదాయాలను తిరిగి ఆకలింపు చేసుకొంటాయని ఆశాభావం వ్యక్తంచేశారు. అందరితో కలుపుగోలుతనం, పరిశుభ్రత, ఆవిష్కరణలను సమ్మిళితం చేసి భారతీయతత్వంతో క్రమంగా పురోగమిస్తున్నామని పేర్కొన్నారు. దేశంలోని ఉన్నతమైన జీవన ప్రమాణాలను తర్వాతి తరాలకు అందించాలని సూచించారు. సమావేశంలో తెలుగు రాష్ట్రాల నుంచి పలు ఐసీఎస్‌ఈ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యాలు పాల్గొన్నారు.

'మాడల్' ప్రవేశ పరీక్ష ఫలితాలపై ఎన్నికల ఎఫెక్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 7(నమస్తే తెలంగాణ): తెలంగాణ మాడల్ స్కూళ్ల ప్రవేశ పరీక్ష ఫలితాలపై లోక్‌సభ ఎన్నికల ప్రభావం పడింది. ఆదివారం ప్రవేశపరీక్ష నిర్వహించగా, ఫలితాలను విడుదలపై అధికారులు తర్జనభర్జనపడుతున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పునరాలోచనలో పడ్డారు. ఉన్నతాధికారులను సంప్రదించి ఓ నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు. ఆరు నుంచి పదోతరగతిలో ప్రవేశాలకు ఆదివారం జరిగిన పరీక్షకు 51,525 మంది విద్యార్థులు హాజరుకాగా, 11,457మంది డుమ్మా కొట్టారు.

నేడు ఐఐఎంసీలో కామర్స్ టాలెంట్ టెస్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 7(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ (ఐఐఎంసీ) కాలేజీలో ఈ నెల 8న కామర్స్ టాలెంట్ టెస్ట్ జరుగనున్నది. డిగ్రీ, పీజీ విద్యార్థుల్లో దాగిన ఉన్న నైపుణ్యాలను గుర్తించేందుకు నిర్వహిస్తున్న ఈ పరీక్ష పోటీల్లో గెలిచిన వారికి నగదు పురస్కారం అందజేయనున్నారు. మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమయ్యే టాలెంట్ టెస్ట్‌లో మొదటి బహుమతిగా రూ. 5వేలు, రెండో బహుమతిగా రూ. 3వేలు, మూడో బహుమతిగా రూ.2వేలు ఇవ్వనున్నారు. ఈ ప్రతిభా పరీక్షకు హాజరయ్యేందుకు ఉదయం నుంచి కాలేజీ ప్రాంగణంలో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని నిర్వహకులు సూచించారు. కాగా, ఈ కార్యక్రమానికి 'నమస్తే తెలంగాణ' దినపత్రిక మీడియా పార్టనర్‌గా వ్యవహరిస్తున్నది.

పోటీ పరీక్షలపై ప్రొఫెసర్ నాగేశ్వర్ లైవ్‌షో

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పోటీ పరీక్షలపై అవగాహన కల్పించేందుకు ప్రొఫెసర్ నాగేశ్వర్‌తో ప్రత్యేక ప్రత్యక్ష ప్రసారం నిర్వహించనున్నట్టు టీ శాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. టీశాట్ నిపుణ చానల్‌లో సోమవారం ఉదయం 11 గంటల నుంచి ఈ ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని వెల్లడించారు. అభ్యర్థులు తమ సందేహాల నివృత్తికి 040 23540326 / 726, టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 4039 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. ఇవే ప్రసారాలు టీ-శాట్ విద్యచానల్‌లో సోమవారం సాయంత్రం ఆరు గంటలకు పునఃప్రసారం అవుతాయని వివరించారు.

విద్యార్థుల పరిజ్ఞానం పెంపునకు జేఎన్‌టీయూలో వర్క్‌షాపులు

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ విద్యార్థులకు పరిశోధన విధానాలు, థిసీస్ రూపకల్పన, నాయకత్వ, జీవన నైపుణ్యాలు వంటివి పెంపొందించడమే లక్ష్యంగా జేఎన్‌టీయూలో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) విభాగం హెచ్‌వోడీ డాక్టర్ కే సుప్రీతి ఆధ్వర్యంలో రెండు రోజులుగా టెక్ వర్క్‌షాప్‌లతో నిర్వహించిన క్వెస్ట్ -2024 కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి ఫెస్టులు, వర్క్‌షాపులు విద్యార్థులలో సాంకేతిక పరిశ్రమలో నిరంతర అభ్యాసం, ప్రాముఖ్యతను నొక్కి చెబుతాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు విలువైన, ఆచరణాత్మకమైన అనుభవాన్ని అందించాయని సుప్రీతి పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌లకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 300 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో కూడా మరికొన్ని అంశాలపై క్వెస్ట్ ప్రోగ్రాంలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఎప్‌సెట్ దరఖాస్తుల సవరణకు చాన్స్

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : టీఎస్ ఎప్‌సెట్ (ఇంజినీరింగ్, ఫార్మసీ, నర్సింగ్) దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను ఈ నెల 8 నుంచి 12 వరకు సవరించుకోవచ్చని ఎప్‌సెట్ కన్వీనర్ డీన్‌కుమార్ తెలిపారు. విద్యార్థి తల్లి, తండ్రి పేరు, అడ్రస్, ఆదాయం (రూపాయల్లో) , కులం సర్టిఫికెట్ నంబర్, లింగం (అబ్బాయి, అమ్మాయి) వంటి వివరాల్లో దొర్లిన తప్పులను సవరించుకోవచ్చని తెలిపారు. ఎప్‌సెట్ హాల్‌టికెట్లను ఈ నెల 29 నుంచి వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని తెలిపారు.

'విద్యుత్తు కొనుగోళ్ల' అధికారులకు నోటీసులు?

హైదరాబాద్, ఏప్రిల్ 7(నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల్లో భాగస్వామ్యమైన అధికారులకు జ్యూడీషియల్ కమిషన్ నోటీసులు జారీచేయనున్నది. దీంతోపాటు భద్రాద్రి థర్మల్‌ప్లాంట్లు, యాదాద్రి థర్మల్‌ప్లాంట్ల నిర్మాణం విషయంలో కీలకపాత్ర పోషించిన సంస్థలు, అధికారులు విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇవ్వనున్నది. విద్యుత్తు కొనుగోళ్లు సహా విద్యుత్తు కేంద్రాల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం జ్యూడీషియల్ విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి నేతృత్వంలో కమిషన్‌ను నియమించగా, ఈ కమిషన్ మొదటి సమావేశం ఆదివారం బీఆర్కే భవన్‌లో నిర్వహించారు. టీఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వీ, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాస్‌రావు, డైరెక్టర్లు సచ్చిదానందం, ఏ అజయ్ కమిషన్ ముందు హాజరయ్యారు. ఆ మూడు అంశాలపై ప్రజల నుంచి కూడా కమిషన్ సలహాలు స్వీకరించనున్నది. ఆయా అంశాలపై సమాచారం ఉన్న వారు ఈ మెయిల్ ద్వారా లేదా నేరుగా కమిషన్‌కు అందజేయవచ్చని కమిషన్ వర్గాలు తెలిపాయి. అవసరమైతే నోటీసులందుకున్న వారి నుంచి వాంగ్మూలం సేకరించేందుకు ప్రత్యక్ష విచారణకు పిలువాలని కమిషన్ నిర్ణయించింది.

క్యాన్సర్ మందులనూ వదలని మాఫియా

- అధిక ధరలకు లెట్రోజోల్ మాత్రల అమ్మకం
- హైదరాబాద్, నల్లగొండలో దాడులు.. మందుల సీజ్

మందులను పరిశీలిస్తున్న డీసీఏ అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): మనుషుల రోగాలను ఆసరా చేసుకొన్న ఫార్మా మాఫియా నిలువుదోపిడీ చేస్తున్నది. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు ఔషధాలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నది. ఈ మేరకు సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు శనివారం హైదరాబాద్ నగరంతోపాటు నల్లగొండ ప్రాంతంలోని పలు మెడికల్ షాపులపై దాడులు చేసి పెద్ద మొత్తంలో లెట్రోజోల్ ట్యాబ్లెట్ ఐపీ 2.5 ఎంజీ మాత్రలను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హర్యానా కేంద్రంగా స్టెపన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ఫార్మా సంస్థ 'సైలెట్-2.5' (లెట్రోజోల్ ట్యాబ్లెట్ ఐపీ 2.5 ఎంజీ) అనే మాత్రలను రొమ్ము క్యాన్సర్ చికిత్సకు వినియోగిస్తారు. ప్రతి ఐదు మాత్రలతో కూడిన ఒక స్ట్రిప్ ధర జీఎస్టీ, సెల్లింగ్ ప్రైస్‌తో కలిపి రూ.164.2గా నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైజింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) నిర్ణయించింది. కానీ సంబంధిత ఔషధ తయారీ కంపెనీ మాత్రం ఎన్‌పీపీఏ నిబంధనలకు విరుద్ధంగా 5 మాత్రలతో కూడిన ఒక స్ట్రిప్ ధర రూ.199గా పేర్కొంటూ మాత్రలపై ముద్రించి విక్రయిస్తున్నది. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఒక్కో స్ట్రిప్‌పై రూ.34.80 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నది. డీసీఏ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు జరిగిన ఈ దాడుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు సోమేశ్వర్, జీ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత వద్ద 6 లక్షలు పట్టివేత

మహేశ్వరం శివారులోని చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్న నగదు

నర్సంపేట రూరల్, ఏప్రిల్ 7: కాంగ్రెస్ మహిళా నేత ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘించి రూ.6 లక్షల నగదు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం గుంటూర్‌పల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ ఆదివారం నర్సంపేట నుంచి గుంటూర్‌పల్లికి కారులో రూ.6 లక్షలు తరలిస్తున్నారు. ఈ క్రమంలో మహేశ్వరం శివారు చెక్‌పోస్టు వద్ద ఎస్సై ప్రవీణ్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేయగా నగదు లభిచింది. ఇందుకు సంబంధించి ఆమె ఎలాంటి ఆధారాలు చూపించక పోవడంతో సీజ్ చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

కొడుకు మృతిని తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య

రాజయ్య (ఫైల్)

నల్లబెల్లి, ఏప్రిల్ 7: చేతికి అందివచ్చిన కొడుకు అకస్మాత్తుగా మృతి చెందడంతో మనస్తాపానికి గురైన తండ్రి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండెళ్లపల్లి గ్రామానికి చెందిన రాదారపు రాజయ్య (60)కు ముగ్గురు కొడుకులు. రెండో కొడుకు నవీన్(32) ఎనిమిది నెలల క్రితం అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. ఎదిగిన కొడుకు మృతి చెందిన నాటి నుంచి మానసికంగా కుంగిపోయిన రాజయ్య మనస్తాపానికి గురై శనివారం రాత్రి తన వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు. గతంలో ఆయన మండల ఉత్తమ రైతుగా కేసీఆర్ ప్రభుత్వం నుంచి ప్రశంసాపత్రం అందుకున్నాడు. రాజయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

రాధాకిషన్‌రావుకు నాలుగు రోజుల కస్టడీ పూర్తి

ఫోన్ల ట్యాపింగ్ కేసులో మరో ఇద్దరు కానిస్టేబుళ్లపై విచారణ

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును కస్టడీలోకి తీసుకున్న పోలీసులు బంజారాహిల్స్ స్టేషన్‌లో ఆదివారం వరుసగా నాలుగో రోజు ఆయనను ప్రశ్నించారు. విచారణ నిమిత్తం రాధాకిషన్‌రావును కోర్టు ఏడు రోజులపాటు పోలీస్ కస్టడీకి అప్పగించిన విషయం తెలిసిందే. కాగా, ఇదే కేసులో నల్లగొండకు చెందిన మరో ఇద్దరు కానిస్టేబుళ్లను కూడా దర్యాప్తు అధికారులు విచారణకు పిలిపించినట్టు తెలుస్తున్నది. గతంలో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ)లో పనిచేసిన ఈ ఇద్దరు కానిస్టేబుళ్లు.. అక్కడ ఫోన్ల ట్యాపింగ్‌కు ఉపయోగించిన టెక్నాలజీని తర్వాత బయట కూడా ఉపయోగించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యలోనే వారిని పోలీసులు విచారణకు పిలిపించినట్టు సమాచారం.

ఆత్మహత్యా? మిస్ ఫైరా?

- బాలేశ్వర్ మరణంతో పోలీసుల ఉలికిపాటు
- గన్ మిస్ ఫైర్‌పై ఉన్నతాధికారుల విచారణ

బాలేశ్వర్ (ఫైల్)

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 7: పాతబస్తీలో రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఎస్సై) గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకోవడం పోలీసు వర్గాలను కలవరపాటుకు గురిచేసింది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన వివరాలను హుస్సేనీ ఆలం పోలీసులు మీడియాకు వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం లక్ష్మీపూర్‌కు చెందిన బాలేశ్వర్ (48)కు భార్య, పిల్లలు ఉన్నారు. 1995 బ్యాచ్‌కు చెందిన బాలేశ్వర్ మహబూబ్‌నగర్ 10వ బెటాలియన్‌లో ఆర్ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాడు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 6న పాతబస్తీలో విధులు నిర్వహించేందుకు వచ్చాడు. ఒక్కరోజు వ్యవధిలోనే ఆదివారం తెల్లవారుజామున గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన తోటి సిబ్బంది ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే బాలేశ్వర్ మరణించాడు. బాలేశ్వర్ దవడ కింది భాగం నుంచి రెండు రౌండ్ల బులెట్లు దూసుకెళ్లినట్టు గుర్తించారు. ఈ ఘటన జరిగిన వెంటనే దక్షిణ మండలం డీసీపీ పీ సాయి చైతన్య, చార్మినార్ ఏసీపీ, హుస్సేనీ ఆలం ఇన్‌స్పెక్టర్ సురేందర్ ఘటనా స్థలానికి చేరుకొని.. బాలేశ్వర్ గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడా? గన్ మిస్ ఫైర్ అయిందా? కుటుంబంలో ఏమైనా కలహాలున్నాయా? ఆర్థిక, ఆరోగ్య సమస్యలేమైనా వెంటాడుతున్నాయా? అనే కోణంలో విచారణ చేపట్టారు. అనంతరం బాలేశ్వర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. కేసును హుస్సేనీ ఆలం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆవు కళేబరాన్ని పరిశీలిస్తున్న బీట్ అధికారి వెంకటేశ్

పులిదాడిలో ఆవు మృత్యువాత

బెజ్జూర్, ఏప్రిల్ 7 : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం పెద్ద సిద్దాపూర్ గ్రామానికి చెందిన గుర్లె శంకర్ ఆవు పులి దాడిలో మృతి చెందింది. శనివారం ఉదయం ఆవుల మంద మేత కోసం స్థానిక అటవీ ప్రాంతానికి వెళ్లింది. రాత్రి వరకూ తిరిగి రాకపోవడంతో శంకర్ అటవీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఆదివారం అటవీ అధికారులతో కలిసి మత్తడి ప్రాంతంలో వెతుకుతుండగా ఆవు కళేబరం కనిపించింది. అక్కడే పులి అడుగులను గుర్తించారు. పులి దాడి వల్లే ఆవు చనిపోయినట్టు అధికారులు నిర్ధారించారు.

10 మందితో 'భద్రాచలం' సమన్వయ కమిటీ

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదివారం పదిమందితో భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కమిటీని నియమించారు. మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ కోసం ఈ కమిటీ పనిచేస్తుందని తెలిపారు. కమిటీలో రావులపాటి రాంప్రసాద్, తాండ్ర వెంకటరమణారావు, మానే రామకృష్ణ, బోదెబోయిన బుచ్చయ్య, గుడవర్తి నరసింహమూర్తి, సాగిని శ్రీనివాసరాజు, కోటేరు శ్రీనివాసరెడ్డి, దొడ్డి తాతారావు, రమేశ్‌గౌడ్, సాదనపల్లి చిట్టిబాబు కమిటీలో ఉన్నారు. పార్టీ శ్రేణులకు, ప్రజలకు మధ్య ఈ కమిటీ సంధానకర్తగా వ్యవహరిస్తుంది.

...ఆత్మహత్య చేసుకోలె

మొదటిపేజీ తరువాయి...

పెండింగ్ ప్రాజెక్టు పనులన్నీ సకాలంలో పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజుల్లోనే రూ.50 వేల కోట్లతో మూసీ ప్రాజెక్టు ప్రక్షాళనకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి పార్లమెంటు ఎన్నికల్లో తగిన బుద్ధిచెబుతామని హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ ఎంపీ స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

శాంతి 70 ఎ/సి - నారాయణగూడ
ఎఎఎ ఎ/సి - అమీర్‌పేట | ప్రసాద్ - ప్రసాద్ - ఎన్.టి.ఆర్.గార్డెన్స్
ఎఎంబి ఎ/సి - గచ్చిబౌలి | లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్
PVR ఆర్.కె - బంజారాహిల్స్ | INOX అశోక ఎ/సి - వై.జంక్షన్ | ఎంక్యూబ్ - అత్తాపూర్
PVR పెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | Cinépolis లులు మాల్ - కూకట్‌పల్లి | ఐపీ స్క్వేర్